# యాత్ర

"పప్పులు కొనిపెడతాను. దారిలో పువ్వులు కోసి యిస్తాను. పాపా! రావూ నాదగ్గరికి?"...పాప చిన్నబుర్రలో రకరకాల పప్పులు, రంగు రంగుల పువ్వులు వెన్నెల మడుగుకు మల్లే పరుచుకున్నాయి. కళ్ళముందు ఒక కొత్త ప్రపంచం విప్పుకుంది. అయినా పాప చలించలేదు. ఏడుస్తో కంటి నీటి పొరల్లోంచి రంగుల ప్రపంచాన్ని సృష్టిస్తున్న మనిషి వేపు చూచింది.

"అన్నయ్య కన్నా ముందర వెళ్ళి, పప్పులు కొనుక్కుందాం-పువ్వులు కోసుకుందాం. రా! పాపా, నా దగ్గరికి." పాపకు అన్నయ్యతో పోటీ పడడమంటే ఎంతో సరదా. పాప, ఈ కొత్త ఆకర్షణకు తట్టుకోలేక, ఏడుస్తూనే చేతులు చాచింది. ఆ మనిషి పాపను చప్పున ఎత్తుకొని పప్పుల దుకాణం వేపు దారి తీసింది. అణా పెట్టి పాపకు బటాణీలు కొనిపెట్టింది. పొట్లుతీస్తూ, ఒక్కొక్కటిగా బటాణీలు పాపకు అందిస్తున్నది. పాప కళ్ళల్లో చిరునవ్వు తొణికిసలాడింది.

"మా మనిషే, తీసు కెళ్ళండి. పాపను పాపనాశనానికి ఎత్తుకొస్తుంది" అన్నాడు. పాపను పాపనాశనానికి ఎత్తుకొని వెళ్ళడానికై రాఘవరావు కుదిర్చిన మనిషి—

"ఏం, నువ్వు రావా?" అని ఆతురతగా ప్రశ్నించాడు రాఘవరావు.

"పాప ససేమిరా నా దగ్గరికి రావడం లేదు. ఎంత ప్రయత్నించినా లాభం లేకుండా వుంది" అని క్లుప్తంగా జవాబు చెప్పాడు అతను.

రాఘవరావు, తన భార్యా పిల్లలతో పాపనాశనానికి బయలుదేరాడు. ఎగువ తిరుపతి పొలిమేరలు దాటగానే, జట్లు జట్లుగా భక్తులు, పాపనాశనానికి వెడుతున్నవాళ్ళు, తిరిగి వస్తున్నవాళ్ళు కనిపించారు. కొన్ని గుంపుల్లోంచి "వెంక టేశ్వరస్వామికీ జై" అనే ధ్వానాలు మిన్నుముట్టుతున్నాయి. వాళ్ళంతా తమ ఆవేదనల్నీ, ఈతిబాధల్నీ మరిచి ఐక్య కంఠంతో జయజయ ధ్వానాలు చేయడం, స్త్రీ పురుష భేదం లేకుండా భక్తులు స్వామికి తల నీలాలు ముడుపుగా చెల్లించడం, పాపాల్ని కడిగివేయడానికి కొండలు, లోయల మీదుగా పాపనాశనానికి ఆ నాలుగు మైళ్లూ నడక సాగించడం రాఘవరావుకు ముచ్చటగా తోచింది. ఎదురుపడిన భక్తుల్ని పక్కగా తప్పించుకొంటూ మరి కొంత దూరం నడిచేసరికి అతనికి ఒక వంద గజాలలో ఒక కొండ కనపడింది. భార్యా పిల్లలతో ఆ కొండ దాటలేననే అధైర్యం కలిగింది.

"నీ పేరు?" అని పాపను ఎత్తుకున్న కూలి మనిషిని అడిగాడు.

"రంగి" అని చిలిపిగా నవ్వుతో, ఆ మనిషి సమాధానం చెప్పింది. రాఘవరావుకు ఎందుకో ఆ జవాబు ఎగటుగా తోచింది.

"మీ మనిషి ఏడీ?" అని రాఘవరావు తిరిగి గంభీరంగా ప్రశ్నించాడు.

"మా మనిషా ?" అని రంగి, తెచ్చిపెట్టుకున్న ఆశ్చర్యంతో రాఘవరావును ఎదురు ప్రశ్న వేసింది.

రాఘవరావు పొరపాటు గ్రహించాడు. సరిదిద్దుకునే ఉద్దేశంతో "ఇందాక మనతో వచ్చిన మనిషి నీ కేమవుతాడు ?" అని తిరిగి రంగిని ప్రశ్నించాడు.

"నేస్తం" అని రంగి వెకిలిగా నవ్వింది. ఆ నవ్వులోని అంతరార్థం రాఘవరావుకు స్ఫురించినా, స్ఫురించనట్టే నటించాడు.

రాఘవరావు భార్య సుభద్ర, రంగిని చురచురా చూసింది.

"అతని పేరు ?" అని మళ్ళీ ప్రశ్నించాడు.

"రంగడు" అని కళ్ళతో నవ్వుతూ సమాధానం చెప్పింది.

"బాబును ఎత్తుకోవడానికి ఆ రంగడినిపిలుచుకొస్తావా?"

"బాబును ఎత్తుకోవడానికి ఆ పూల రంగడే కావాలా? దారిలో ఎంతోమంది మనుషులు దొరుకుతారు, ఎవరినైనా కుదుర్చుకోవచ్చు. పైగా వాడు ఒకచోటని వుండడు. వాడిని వెతికి పట్టుకోవడం కష్టం" అంది నర్మగర్భంగా.

భక్తులు కాలి నడకనా, డోలీలపైన ప్రయాణం చేస్తూనే ఉన్నారు. ఐక్యకంఠంతో జయజయధ్వానాలు చేస్తూనే వున్నారు.

ఇంతలోకే కొండవచ్చింది. కొండ అడుగున కూర్చున్న ఇద్దరు కూలీమనుషులు "డోలీ కావాలా బాబు ?" అని రాఘవరావుని ప్రశ్నించారు.

"పిల్లలతో నీవు నడవలేవు. డోలీ కట్టించుకుందామా?" అని రాఘవరావు సుభద్రను అడిగాడు.

"పెద్ద పిల్లలు ఇద్దరికీ కట్టించండి. నేను నడవగల"నని సుభద్ర కొండమెట్లు ఆయాసంగా ఎక్కుతూ సమాధానం చెప్పింది.

"నేను నడవగలను నాన్నా!" అని బాబు ఒకవేపు "నేను నడుస్తాను నాన్నా!" అని సుధ ఇంకొకవేపూ పిల్లలిద్దరూ మారాం చేయడం మొదలెట్టారు.

"బాబూ! డోలీ" అని మళ్ళీ.

"అక్కర లే" దని రంగి, ఆ ఇద్దరి మనుషులకు సమాధానం చెప్పడం రాఘవరావుకు వింతగా తోచింది.

రాఘవరావు ప్రశ్నార్థకంగా సుభద్ర వేపు చూచాడు.

"డోలీ అక్కరలేదు. మనిషి నెవరినైనా కుదుర్చుకుందా" మని సుభద్ర అంది.

పిల్లలు ఉత్సాహంగా, గంతులేస్తూ మెట్లెక్కుతున్నారు. పాప బటాణీలు తింటోంది. రంగి పాపకు ఏవో కబుర్లు చెబుతున్నది. పాప ఊ కొడుతూ వింటున్నది.

కబుర్ల మధ్య రంగి అప్పుడప్పుడు పాపను గుండెకు గట్టిగా హత్తుకుంటున్నది.

రాఘవరావు ఏమీ తోచక కొండను ఒక మాటు కలయచూచాడు. చిన్న చిన్న పొదలతో, రంగు రంగుల అడవి పువ్వులతో కొండ చూడ ముచ్చటగా వుంది. ఎడమ వేపు ఒక పెద్ద లోయ, లోయనిండా చెట్లు గుబుర్లు కన పడ్డాయి. లోయలో పక్షుల రొద ఆ ప్రశాంతతను కలవర పెడుతోంది. కొండపైకి ఎక్కే సరికి, పిల్లల ఉత్సాహం

చచ్చింది. ఎండ తీవ్రత హెచ్చింది. సుభద్ర అలిసి, ఒక పొద పక్కన కూర్చున్నది. పది గజాల ఎడంలో, రంగి కూడా పాపను వొళ్ళోకి తీసుకొని కూర్చున్నది. బాబు, సుధ, రంగి పక్కకు చేరుకున్నారు.

"బాబూ, నేను మీ ఊరికి రానా?" అని రంగి అడుగుతోంది.

"అప్పటినించీ చెల్లెల్నే ఎత్తుకున్నావు - నన్ను ఎత్తుకో లేదు, నేను తీసుకెళ్ళను" అని బాబు నిష్కర్షగా సమాధానం చెప్పాడు.

"చెల్లెల్ని ఎత్తుకుంది కదూ. పోనీ తీసుకెడదాం" అంది సుధ మధ్యవర్తిత్వం వహిస్తో.

"తీచుకెల్దాం. తీచుకెల్దాం" అని పాప కేరింతలు కొట్టింది.

"నీకు అమ్మా, నాన్నా లేరూ? వాళ్ళను వదిలి ఎట్లా వస్తావ్?" అని బాబు దిగులుగా ప్రశ్నించాడు.

"ఎవ్వరూ లేరు."

"అయితే? పాపం! తీసుకెడుదాం రా బాబు" అంది సుధ సానుభూతి ఉట్టిపడుతున్న కంఠంతో.

"చెల్లెలు, అక్కా- ఎవరూలేరా?" అన్న బాబు కంఠం దిగులుకు బదులు ఆశ్చర్యాన్ని ధ్వనించింది.

"లేరు."

రంగికి అమ్మా, నాన్నా, అక్కా, చెల్లెలూ ఎవరూ లేకపోవడం బాబుకు కళ్ళనీళ్ళపర్యంతంఅయింది. చప్పున లేచి, తల్లి దగ్గరికి పరుగెత్తుకొని వెళ్ళి "అమ్మా, రంగిని మన ఊరికి తీసుకెడుదామా?" అని అడిగాడు.

"మీ నాన్నను అడుగు" అని సుభద్ర బాబుకు జవాబు చెప్పింది.

రాఘవరావు ఆ సూచనకు తికమకపడ్డాడు. "నాన్నా! తీసుకెడుదామా?" అని బాబు ప్రశ్నించేసరికి, అనాలోచితంగా సుభద్రనూ రంగినీ వరుసగా చూచాడు. సుభద్రకళ్ళు కొంటెగా నవ్వుతున్నాయి. రంగి చెక్కిళ్ళు ఎందుకో ఎర్ర బారాయి. రాఘవరావు అలాగే చూస్తున్నాడు. రంగి అమాంతంగా తల కిందికి వాల్చింది.

"తీసికెడుదామా నాన్నా?" అని బాబు రెట్టించాడు.

రాఘవరావుకు 'వద్దని' చెప్పడానికి నోరు రాలేదు.

"చూతాములే" అని తప్పించుకున్నాడు. బాబుకి ఆ మాట అర్థంకాక, "నాన్న తీసుకెడుతానన్నా"డని గంతు లేస్తూ రంగిని సమీపించాడు.

రంగి, వొళ్ళోవున్న పాపను కిందికిదించి, బాబును గట్టిగా కావలించుకొని ముద్దు పెట్టుకుంది. రాఘవరావు ఆ సంగతి గమనించి, రంగి ధోరణి శృతిమించి రాగానపడుతున్న దనుకున్నాడు.

ఇంతలోనే సుభద్ర లేచింది. రంగి పాపను ఎత్తుకున్నది. పిల్లలు రంగిపక్కన నడుస్తున్నారు. తాను వెనకాల నడుస్తు న్నాడు. తనకూ, సుభద్రకూ మధ్య పాప నెత్తుకుని రంగి.

వంద అడుగులు వేసిందో, లేదో రంగి చప్పున వెనక్కి మళ్ళి వారగంటితో రాఘవరావును చూచి చిరునవ్వు నవ్వింది. రాఘవరావుకు వళ్లు మండి, విసురుగా తల పక్కకు తిప్పుకున్నాడు.

జయజయధ్వానాలతో మిళితమై రంగి ఒక పెద్ద సమస్యగా పరిణమించింది. ఆ లేకిచూపులకూ, ముసిముసి నవ్వులకూ అర్థం ఏమిటా అని ఆలోచించాడు. ప్రయాణీకుల్ని తన లేకి చూపులతో మోసగించి, వలలో వేసుకొని మరికొంత డబ్బు లాగడం దాని ఆశయం... కాదు, వృత్తి అయివుంటుందా అని, తన్నుతాను ప్రశ్నించుకున్నాడు. అయితే కావచ్చునని హృదయం సమాధానం చెప్పింది. తరిచి తెలుసుకోవడం మంచిదని బుర్ర హెచ్చరిక చేసింది.

రాఘవరావు త్వరగా నడిచి రంగిని చేరుకున్నాడు—

పక్కగా నడుస్తూ "రంగీ! నీకు పెళ్ళి అయిందా?" అని అడిగాడు. స్వామికి తల నీలాలు సమర్పించిన ఒక భక్తురాలు రాఘవరావునూ, రంగినీ విడదీస్తూ మధ్యగా వెళ్లింది.

"లేదు, కాలే"దని రంగి జవాబు చెప్పింది.

"ఎందుకు చేసుకోలే"దని రాఘవరావు తిరిగి అడిగాడు.

"ఊరికేనే" అని రంగి తప్పించుకొనడానికి చూచింది.

"లేకి చూపులకు అలవాటుపడి" అని హృదయం, "తొందరపడి మనుషుల్ని ఇష్టమొచ్చినట్లు విలువ కట్టవల"దని మెదడు హెచ్చరిస్తూ వుండగానే రాఘవరావు "ఊరికేనే అంటే డబ్బు లేకనా, మనిషి దొరక్కనా?" అని అడిగేశాడు.

"నాకు ఎవ్వరూ లేరు. పెళ్లి ఎవరు చేస్తారు?" అని అడిగింది రంగి.

"ఎవ్వరూ లేకపోతే, మరి నీ వెందుకు చేసుకోలేదు?"

"ఆడ మనుషులు తమకు తామే పెళ్లి చేసుకోగలుగుతారా?"

"ఎవరైనా, నిన్ను చేసుకుంటానని ముందుకు రాలేదూ?"

"వస్తే, వాళ్ళదగ్గర డబ్బుండక్కర్లా?"

"డబ్బున్నవాళ్ళు ఎవరూ రాలేదా ?"

"డబ్బున్నవాళ్ళు మంచి సంబంధాలు చూసుకుంటారు. నన్నెవరు చేసుకుంటారు ?"

"పోనీ, డబ్బు లేనివాడిని ఎవడినైనా చేసుకోలేక పోయినావా ?"

"నాకు జ్ఞాన మొచ్చేసరికీ పెద్దదాన్ని అయినాను. అప్పటికే మా నాన్నా అమ్మా చనిపోయినారు. బ్రతుకు గడవడమే అప్పట్లో చాలా కష్టంగా వుంది. కూలినాలి చేసుకొని బతుకు ఈడుద్దా మనుకుంటే, నన్ను చూచేసరికల్లా ప్రతివాడికీ కళ్ళు మెర మెర లాడేవి. కూలి పేరట అన్యాయానికి దిగేవారు. ఆ రోజుల్లో పొట్ట గడవడమే మహా భాగ్యం. విధిలేక అన్నిటికీ తల ఒగ్గవలసి వచ్చేది. నాటికీ నేటికి నా బ్రతుకు ఇంతే."

"అంటే, చివరకు ఈ లేకి చూపులకు, ఈ వెకిలి నవ్వులకు అలవాటు పడ్డావన్న మాట."

రంగి ఈ అవమానానికి తోక త్రొక్కిన తాచుకుమల్లే బుస్సున లేచింది.

"డబ్బు లేకపోతే అన్ని అలవాట్లు చేసుకోవాల్సి వస్తుంది" అని కసికొద్దీ జవాబు చెప్పింది. రాఘవరావు మెదడు గిర్రున తిరిగింది. లేకి చూపులకు, వెకిలి నవ్వులకు లేమి మూలమని చప్పున తోచింది. ఆ మాటలు వినగానే రాఘవరావుకు తనపైన, సుభద్ర, పాప, బాబు, సుధ, అందరిపైనా అసహ్యమేసింది. ఇంతలోకే దారిలో ఒక ముసలిది కనపడింది.

రంగి ఆ ముసలిదాన్ని ఆపి, బాబును ఎత్తుకోవడానికి పది అణాలకు కుదిర్చింది.

పాపనాశనానికి కొండదిగి వెళ్ళాలి. లోయలో వుంది. కొండ దిగడం, ఎక్కడానికన్నా సులభంగా తోచింది. కొత్తగా కుదిరిన కూలిమనిషి కొంచెంసేపు బాబునూ, మరి కొంతసేపు సుధనూ ఎత్తుకొని ముందుకు సాగుతున్నది. అది కొంచెం ఎడంకాగానే—

"నీవు రూపాయన్నర తీసుకొని, దాన్ని పదిఅణాలకు ఎందుకు కుదిర్చావు?" అని రాఘవరావు రంగిని అడిగాడు.

"అంతే న్యాయం కనుక."

"అంటే?".

"పాపనాశనానికి వెళ్ళడానికి రూపాయ మామూలు. నన్ను కుదిర్చిన రంగడికి నేను ఎనిమిదిఅణాలు యివ్వాలి."

"అయితే, నీకుకూడా అన్యాయం జరిగిందన్నమాట."

"మా యిద్దరిలో అన్యాయం ఎవరికీ జరుగలేదు—నా మామూలు నాకు, దాని మామూలు దానికీ దొరుకుతూనే వుంది."

"ఆ ముసలిదాన్ని మాట్లాడి పెట్టినందుకు నీ వేమీ కమీషన్ తీసుకోలేదా?"

"నేను మీరనుకున్న నీచపు మనిషిని కాను."

ఈ వాక్యానికి రాఘవరావు హృదయం బలంగా గాయపడ్డది. డబ్బు కళ్ళతో మనిషిని విలువ కట్టడం హేయ మని బుర్ర గిర్రు మన్నది.

ఎందుకో ఆ క్షణాన భారతావని బుద్ధుడు, గాంధీ వెలిసిన పుణ్యభూమిగా కనపడింది. ఇంతలోకే ఒక భక్త

బృందం సంకీర్తనలు చేస్తూ ముందుకు సాగింది. చిరుతలు, తాళాల చప్పళ్ళు చెవుల్లో గింగురు మన్నాయి. కాలినడక, పాపనాశనాన్ని కనుచూపుమేరలోకి తెచ్చింది. పిల్లలు, నీరు పాయలు పాయలుగా ధారలు పడడం చూచి, కేరింతలు కొట్టటం ఆరంభించారు. సుభద్ర పాపనాశనం గట్టుకు చేరు కొని స్నానానికి సన్నాహాలు ప్రారంభించింది. పిల్లల బట్టలు విప్పింది.

చిన్న నిక్కర్లతో పిల్లలు ఉత్సాహంగా స్నానానికి సిద్ధమైనారు. ఒక్కొక్కరినే రాఘవరావు తీసుకువెళ్ళి బలంగా పడుతున్న ధారలో ముంచి పైకి ఎత్తుకొని వచ్చాడు. స్నానం చేసేటప్పుడు మాత్రం ఆ ధార బలానికి పిల్లల ఉత్సాహం చచ్చింది. చివరకు రాఘవరావు, సుభద్ర స్నానాలు చేశారు. అడగనిదే వచ్చి రంగి తడిబట్టలు పిండి పెట్టింది. రాఘవరావు నెమ్మదిగా సుభద్ర, పిల్లలతో గట్టున వున్న కాఫీహోటలుకు దారితీశాడు. వేడి వేడి ఇడ్లీ, కాఫీ లతో అందరికీ కొంత అలసట తీరింది. రంగీ, ముసలిది ఇడ్లీ తిని కాఫీ త్రాగారు. రాఘవరావు వాళ్ళ డబ్బు చెల్లించ బోతే, రంగి వద్దని వారించింది. ముసలిదాని డబ్బు కూడా తానే ఇచ్చింది. రాఘవరావుకు ఈ సంఘటన చూచి రంగి ఉదారాన్ని నటిస్తున్నదా అన్న అనుమానం కలిగింది. హృదయం ఆ భావాన్నే బలపరచింది.

"తొందరపడి మనిషిని విలువ కట్టకూడ" దని బుర్ర తిరిగి హెచ్చరిక చేసింది. తిరుగు ప్రయాణంలో రాఘవరావు సుభద్ర, సుధల కోసం డోలీ కట్టించాడు. సుభద్ర అలసి పోవడంవల్ల డోలీ ఎక్కడానికి ఎట్టి అభ్యంతరం చెప్పలేదు.

రంగి డోలీ కుదిర్చి పెట్టింది — ఒక రూపాయికు — డోలీ ముందర నడుస్తున్నది. డోలీ వెనకాల ముసలిది బాబును ఎత్తుకొని రొప్పుతూ మెట్లు ఎక్కుతున్నది. రంగి పాపను ఎత్తుకొని ముసలిదాని వెనకాల అడుగు లేస్తున్నది. రంగి వెనకాలే రాఘవరావు. అతని కెందుకో రంగిని నఖశిఖ పర్యంతం చూడా లనిపించింది. ఒకమాటు రంగి వెనక్కు మళ్లి చిరునవ్వు నవ్వితే బాగుండు ననిపించింది. కాని, ఎందుకో రంగి వెనక్కు మళ్ళలేదు. రాఘవరావు హృదయం రంగి లేకిచూపులకోసం, వెకిలి నవ్వులకోసం ఆరాటపడసాగింది. త్వరగా నాలుగు అడుగులు ముందుకువేసి రంగిని కలుసు కున్నాడు, పక్కగా నడుస్తో. "డోలీ కుదుర్చడంలో ఎంత కమీషన్ కొట్టా" వని అడిగాడు.

"చాలా" అని రంగి జవాబు చెప్పింది.

"అంతే?"

రంగి పాపను తన రొమ్ముకు హత్తుకుంది. రాఘవరావు హృదయం ఒక్కుమ్మడిగా ఎగిరి గంతు వేసింది. కాని తన సంతోషాన్ని కనపరచడానికి నోట మాట పెగల్లేదు. కాళ్ళు నడుస్తున్నాయి. హృదయం ఎందుకో వేగంగా కొట్టు కొంటున్నది. చిరుతలు, తాళాల ధ్వనులతో చెవులు గింగురు మంటున్నాయి. జయజయ ధ్వానాలు హృదయంలో మారు మ్రోగుతున్నాయి. బుర్ర ఆలోచనలతో క్రమంగా వేడెక్కు తున్నది. రాఘవరావు తన ఆరాటాన్ని ఆపుకోలేక, "రంగీ! మా వూరికి వస్తావా?" అన్నాడు.

అప్పటి కప్పుడే దగ్గరపడిన ముసలిది ఆ మాట విని చప్పున వెనక్కి తిరిగి, "మా పిల్లే తీసుకెళ్ళండి" అంది.

"రంగీ! వస్తావా?" అని రాఘవరావు రెట్టించాడు.

"చూతాము" అని రంగి సమాధానం చెప్పింది.

"చూతాం ఏమిటే, దొర రమ్మని ఒక్కటే పనిగా అంటుంటే! తీసుకెళ్ళండి బాబూ! దాని కెవ్వరూ దిక్కు లేరు. మొగుడు కూడా వదలిపెట్టాడు" అని మళ్ళీ ముసలిది అందుకుంది.

"రంగికి పెళ్లి అయిందా?" అని రాఘవరావు ముసలి దాన్ని ఆతురతగా ప్రశ్నించాడు.

"అయింది బాబూ! చిన్నతనాన్నే అయింది. వాడికీ ఎవ్వరూ దిక్కు లేరు. వాడు దీని మేనబావే, కాని పిచ్చాడు. దీన్ని వదిలిపెట్టాడు. బాబూ!" అని ముసలిది తన ఆవేదనను వెళ్ళగక్కింది.

"వాడు నన్ను వదిలిపెట్టలేదు. నేనే వాడిని వదిలి పెట్టా" నంది రంగి పొగరుగా.

"మరి పెళ్ళికాలేదని నాతో అబద్ధమెందుకు చెప్పావు?" అని రాఘవరావు రంగిని కోపంగా ప్రశ్నించాడు.

"నిజం చెప్పడం కష్టంగా ఉంటుంది అందుకని" అని రంగి దూకుడుగా సమాధానం చెప్పింది.

రాఘవరావు హృదయం తిరిగి బలంగా దెబ్బతిన్నది. కాళ్ళు అనాలోచితంగా నడుస్తున్నాయి. మెదడు వెలుతురు వేగంతో ఒకటేపనిగా పరుగెత్తుతున్నది. జయజయ ధ్వానాలు గాలిలో కలిసిపోతున్నాయి. భక్తబృందాలు — క్రమంగా దూరమవుతున్నాయి.

"పిచ్చివాడైనంత మాత్రాన భర్తను వదిలిపెట్టాలని ఎక్కడుంది?" అని విసురుగా అడిగాడు.

"రోజూ చావుదెబ్బలు తినమని మాత్రం ఎవరు చెప్పారు?" అని రంగి ఎదురు ప్రశ్నించింది.

రాఘవరావుకు జవాబు తోచలేదు. ఒకక్షణం నిశ్శబ్దంగా గడిచింది. రాఘవరావు మాట్లాడక పోవడం గమనించి రంగి తనధోరణిని తిరిగి అందుకుంది.

"దెబ్బలకు వేగలేక వదిలి పెట్టలేదు. పొట్టగడవక వదలి పెట్టాను. ఆ పిచ్చివాడు పనేమీ చేసేవాడు కాదు. పని చేయమని అడగడానికి కూడా వీలులేనంత పిచ్చి వుండేది. రోజూ కూలినాలి చేసి, సాకడానికి ప్రయత్నించాను. కాని నాకు వచ్చే కూలితో ఒక్కపొట్ట గడవడమే చాలాకష్టమైంది. అందువల్ల లేకిచూపులకూ, వెకిలి నవ్వులకూ అలవాటు పడక తప్పింది కాదు. ఎన్ని అవస్థలు పడ్డా ఎంత శరీరాన్ని కష్ట పెట్టినా రోజూ చావుదెబ్బలు తప్పేవి కావు. ఎంతకని సహించి ఊరుకోను. చివరికి విసిగి వదిలి వేశాను."

"నీకు హృదయం లేదు. ఆ పిచ్చివాడిని వాడి మానా నికి వాడిని వదిలివేసి, కనపడిన వాడి పైనల్లా లేకి చూపులు విసరుతున్నావా?"

"అవును డబ్బులేక పోతే హృదయం వుండదు. పొట్ట గడుపుకోవడానికి ఏ నీచపు పనులైనా చేయక తప్పదు.

రాఘవరావు మెదడు గిర్రున తిరిగింది.

"కులటా! నీ మొహం చూడకూడదు. ఘోరవాది పాతకా లంటుకుంటా" యని రాఘవరావు వళ్ళు తెలియకుండా అరిచాడు. సుభద్ర రాఘవరావును బిత్తరి చూపులు చూచింది.

"బీదతనం, లేకిచూపులు, వెకిలినవ్వులు మనిషిని నవ్వే యంత్రంగా మారుస్తా" యని బుర్ర ఘోషించింది.

"రంగి కులట, జారిణి" అని హృదయం చీత్కారం చేసింది. రాఘవరావు హృదయానికి మెదడు ఘోషణ అరణ్యరోదనంలా తోచింది. తిరిగి తిరుగు ప్రయాణం దగ్గర పడుతున్నది. రాఘవరావు కాళ్ళు యంత్రానికి మల్లే నడుస్తూనే వున్నాయి. భక్తులు జయజయ ధ్వానాలతో స్వామి ఆలయాన్ని చేరుకుంటూనే వున్నారు.

ఎగువ తిరుపతి కనుచూపుమేరలో నిలిచింది.

స్వామి ఆలయ శిఖరాలు మిట్టమధ్యాహ్నం ఎండకు ధగధగ మెరుస్తున్నాయి. సుభద్ర ఊళ్ళో డోలీ ఎక్కడం ఇష్టంలేక డోలీ దిగింది. సుధ డోలీ దిగడంతోనే పరుగెత్తుకొని వచ్చి రంగిని చేరుకుంది.

"రంగీ! మా ఊరు వస్తావా?" అని అమాయకంగా అడిగింది.

రంగి కళ్ళల్లో నీళ్ళు నింపుకొని "చూతాములే" అంది.

"చూతాములే అంటే కాదు. తప్పకుండా వస్తానను" అని సుధ బలవంతం చేసింది. రంగి పాపను దించి సుధను హృదయానికి చేర్చుకొని గొల్లు మన్నది.

సుభద్ర బిత్తర చూపులతో రంగిని చూచింది.

రాఘవరావు తనకు ఈ సంఘటనతో ఏమాత్రం సంబంధం లేనట్లు విసురుగా మొహం పక్కకు తిప్పుకున్నాడు.

స్వామి ఆలయంలోనుంచి లౌడ్‌స్పీకర్ల ద్వారా వెలువడుతున్న వేదఘోష వాతావరణాన్ని శుభ్రపరచడానికి

ప్రయత్నిస్తున్నది. ఉన్నట్టుండి పాప, సుధ, బాబు ఎందుకో అమాంతంగా గొల్లు మన్నారు.

రంగి తన దుఃఖాన్ని దిగమ్రింగి ఇద్దరు పిల్లల్ని ఓదార్చింది. రాఘవరావు సుధను ఎత్తుకున్నాడు. బాబు ముసలి దాని చంకలోంచి తల్లి దగ్గరికి వెళ్ళాడు. రంగి పాపను ముసలి దానికి అందించి, పాపనాశనం దారి పట్టింది. వేదఘోష గాలి పొరల్ని చీల్చుకొంటూ నలుగడల వ్యాపిస్తున్నది. రాఘవరావు "ఇంద డబ్బు తీసుకెళ్ళ" మని రంగి దారిని అడ్డగించాడు.

చప్పున ఒక పది రూపాయల నోటు తీసి దాని చేతుల్లో పెట్టాడు.

రంగి మౌనంగా ఏకధారగా ఏడుస్తో నోటును కసికొద్దీ ముక్కలు ముక్కలుగా చింపి కోపంకొద్దీ నేలను విసిరి కొట్టింది. దూరాన వెంకటేశ్వరస్వామి ఆలయ గోపురాలు ఎండకు తళతళా యథాప్రకారంగా మెరుస్తూనే వున్నాయి. వేదఘోష ఎగువ తిరుపతి వాతావరణాన్ని పవిత్రవంతం చేస్తూనే వుంది. జయజయ ధ్వానాలు మిన్ను ముట్టుతూనే వున్నాయి. రంగి త్వరత్వరగా మనుషుల్ని, ఆలయాన్నీ, గోపురాన్నీ, ఏడుకొండల పైన వెలిసిన వెంకటేశ్వరుడినీ, భక్తులపాలిటి పెన్నిధినీ వదిలి కొండలు, అడవులకేసి బయ ల్దేరింది.

★